# లేకి బతుకులు

అర్వై ఏండ్ల చంద్రమ్మ చూడడానికి డెబ్బై ఏండ్ల కొడవలిలా కనిపిస్తు ఉంది. ముసురుకు తడిసి ఎండిన పత్తి పువ్వులాంటి తల, జీవకళలేని, చూపు తగ్గిన గవ్వ కళ్ళు, ఎముకలకు అంటుకపోయి ముడుతల పడ్డ చర్మం, వెలసిన అదో మాదిరి రంగు. ఏదో పని చేస్తేనే కానీ పూట గడవని పరిస్థితి. సర్కారు వారి సహాయం ఆమెకు అందనే అందలేదు. మాలవాడలో నివసిస్తున్న మట్టి మనిషి ఆమె.

అది వరికోతల కాలం. కొడవళ్ళు పట్టుకొని జనం బావులవైపు నడుస్తున్నారు. వాళ్ళల్లో చంద్రమ్మ ఒకతి. పొద్దు బారెడెక్కింది. అందరు బావి దగ్గర నిలుచున్నారు.

గుత్తకు ఇవ్వమని కూలీలు -

లేదు, కూలీకే పనిచేయ్యమని రామిరెడ్డి కొడుకు శీన్ రెడ్డి. పనగలి దగ్గర నిలుచోని పనిచెయ్యగల వాళ్ళను పొలంలోకి పంపిస్తుంది, శీన్ రెడ్డి భార్య సుశీల.

"మొదట రెండు మళ్ళు కొయ్యంగానే మెదను పక్కకు పెట్టిస్తే రాలిన రాగి ఆకులను పనికి రాని గడ్డిపోచలను ఏరేస్తే కళ్ళం చేయొచ్చు" అని భార్యతో చెప్పి కూలీల వైపు నడిచాడు.

మందిలో ఆకర్న వచ్చిన చంద్రమ్మను ఆపి -

"నీకేం చాతనైతదే, రెక్కాడిచ్చి కొట్టలేవు, కొయ్యలేవు" అంది

"అదేం దొరసాని, యియ్యాలేం కొత్తగ కోస్తున్ననా కలుపు, కోత, కళ్ళం అన్నీ సేసి సేసి ముసల్దాన్ని అయిన" వేలితో కొడవలి పదును తాకి చూస్తూ అంది.

"చేసినన్ని రోజులు పనిచేసినవు కానీ చేతకాకుంట అయినంక ఇంకా చేస్తవా?"

"మరి పూట ఎట్లా ఎల్తది, నీ కాల్మొక్త"

"నీవు కొయ్యలేవు, జరసేపు అట్ల కూర్చో" అంటూ తడిక వేసుకొని వరి మళ్ళవైపు నడిచింది. సుశీలకు పాతికేండ్లు వయసు లక్షణమైతేనేమి, ఉన్న ఇంట్లో పుట్టినప్రభావం అయితేనేమి, సుశీలలో ఓ మాదిరి నిర్లక్ష్య వైఖరి ఆమె మాటల్లోనూ, నడకలోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తూ వుంటుంది.

పనికొద్దనగానే చంద్రమ్మ మనసు చిన్నబోయింది. గుండెలో కదిలిన నిరాశను బరువైన శ్వాసద్వారా వదులుతూ, మౌనంగా వెళ్ళి పక్కనే ఉన్న రావి చెట్టు మొదలును ఆనుకొని కూర్చుంది.

చంద్రమ్మ కొడవలితో భూమి మీద కాట్లు పెడుతూ 'భూదేవి, నీకింత సాకిరి సేస్తే ఏం మిగిలింది?

బావి తోడితే ఏమొచ్చె ?

పొలం అచ్చు కడితే ఏమొచ్చె ?

సేను కాస్తే ఏమొచ్చె ?

పంట ఎవరి గరిసె జేరె ?

పాడి ఎవరి ఇల్లు జేరె ?'

ఐదేండ్ల పిల్లప్పుడు ఈ వూరికి కోడలై వచ్చిన నాటినుండి నేటి వరకు ఆ వూరి అన్ని బావుల దగ్గర నాట్లేసి, కోసి, కొట్టి పుట్లకు పుట్లు పోగు సేస్తే ఏ పూటకు ఆ పూటేనాయె. ఏం బతుకులు, ఈ ఆకలి బతుకులు ? సేసుక బతికే వయసులనే సస్తే బావుండు అనుకుంటూ వావి వైపు చూసింది. ఒకప్పటి రోజులు గొర్తొచ్చి గతంలోకి వెళ్ళింది.

ఆ రోజుల్లో రామయ్య పటేలు రెండెకరాల సెలకను తీసుకొని బావిని తవ్వించిండు. మొదట గడ్డపార వేసింది నా పెనిమిటి రాములు, తట్ట మోసింది నేను. నీళ్ళు పడగానే దోసిళ్ళతో పైకి చల్లిందీ నేనే. ఆ తరువాత ఆయన అక్కణ్ణే జీతం కుదిరే. నా మొగుడు మోటతోలి పొలం పారిస్తేనే కదా, పుట్లు పండి రెండెకరాలు పోయి ఈ రోజు పదెకరాల పొలం అయ్యింది. మొదట జత ఎడ్లతో మొదలయి యియ్యాల ఐదారు జతల ఆవులు, ఎడ్లు, బర్లు ! మోటలు పోయి, ఆయిల్ ఇంజన్ వచ్చె. అదిపోయి కరెంటు మోటారొచ్చె. ఇప్పటి మొగోళ్ళకు మోటల బాధే లేదు. ఆ రోజుల్లో ఆలుమొగలకు రాత్రింబగళ్ళు బాయి, పొలం పనేనాయె. ఆయనతో పాటు పనిచేస్తూ ఉండేది. రామయ్య పటేలు పెండ్లాం సీతమ్మ తనను ప్రతి పనికి పిలుస్తుండేది. ఎంత జేసిన తిండి గుడ్డ అంతకంతకే. నొప్పులు, రోగాలకు అప్పులే. మాకు పిల్లలు కలగలేదని కనపడ్డ దేవుళ్ళకు మొక్కుకుంటిమి. మంత్రాలు, తంత్రాలు, దేవుళ్ళు, దయ్యాలు ఒక్కటేమిటి. తిరిగి, తిరిగి ప్రాణం వేసారె. ఒకరోజు ఆయనతో -

"అందరు పట్నమో, బొంబాయో పోయి మంచిగ బ్రతుకుతుండ్రు, మనం గూడ పోదాం, లేదా కులవృత్తి గుడ్డలు నేసి బ్రతుకుదాం" అంటే యినకపాయె.

సెమటోడిసి సేసినా అప్పే మిగిలే అనుకుంటూ బావివైపు చూసింది. ఒక్కసారె కళ్ళలో నీళ్ళు తిరిగినయి. రాగిచెట్టు మొదటినుండి లేచి బావివైపు వడిచింది. ఆ వొట్టి మొత్తలు చూడగానే మోటలు గుర్తొచ్చేసరికి చంద్రమ్మ మెదడు మొద్దుబారిపోయింది. ఒకరోజు మోట కూలి మోట కొడుతున్న తన భర్త ముందు, పైనమోట. అట్ల తన పసుపు కుంకుమ

రేవున కలిసి బతుకుబండలాయె. కళ్ళలో నీళ్ళు తిరిగినయి. బావి కనబడకుండ మసకలు కమ్మినయి. వొడ్డున కూర్చొని మనసారా ఏడుస్తూ వుంది. అప్పుడు ఆమె చేతలకున్న రాతెండి గోల్ల మీద కన్నీటి బొట్లు రాలుతున్నాయి. చంద్రీ, ఓ చంద్రీ కోస్తున్న మళ్ళ మధ్యన నిలుచున్న సుశీల పిలుపు. కన్నీళ్ళను చినిగిన చీర కొంగుకు అద్దుకొని మొదటి మడివైపు కదిలింది. ఇయ్యాల రామయ్య పటేలు లేడు, సీతమ్మ లేదు. ఇది కొత్తతరం ఆస్తులినే సూసుకుంట్రుండు గానీ అది ఎట్లా వచ్చింది ఎవరికి కావాలె ! సేసేది ఒకరు దోసేది ఒకరు.

" ఓ చంద్రీ, రావే, రా. ఈ మొదలు తీసిన మళ్ళలో రాలిన రాగాకును ఏరేసి అట్టనే పరిగేరుకో " అంది.

సరే అన్నట్టు తలవూపి మొదటి మళ్ళో వంగి రాగి ఆకులను ఏరసాగింది. తల నిండా గత కాలపు జ్ఞాపకాలు.

ఈ మళ్ళు అచ్చు కట్టినప్పుడు పెనిమిటితో పాటు తాను వరాలు పేర్చింది. అరచేతులతో అదిమి చదును చేసింది. అప్పటినుండి పోయినేడు వరకు వరినాట్లు వేయడం, కొట్టటం, రాసులు పోయటం, కూలి గింజలు తీసుకొని పోవటం జరుగుతూ వచ్చింది. పొలాల్లో నీళ్ళతో పాటు తమ రక్తం చెమటవలే పారింది. ఈనాడు సేత కానిదానివని, పని చేయలేవని పనికి రావద్దంటుండ్రు. ఈ ఊరిని, ఈ భూమిని నమ్ముకున్నందుకు కూడు గుడ్డ కరువైంది. ఎన్నడూ కడుపు నిండా తిన్నదీ లేదు, కంటి నిండా నిద్రపోయిందీ లేదు. పొద్దు వరిగే వరకు రెండు మళ్ళలోని రాగి ఆకులు ఏరి , కుప్ప పోసి, ఏరిన పరిగె పనలను కట్టలు కట్టి వరం మీద పెట్టి పక్కన నిలుచుంది.

చివరి పొలం నుండి వచ్చిన సుశీల

"ఏమే ఏరటం అయ్యిందా "

అయ్యిందమ్మా అన్నట్టు తల వూపింది. కూలికి రానియ్యకున్నా పరిగ ఏరుకోనిచ్చినందుకు సంతోషంగానే వుంది.

"ఆటిని అక్కడ వుంచి రేపురా, వొచ్చి ఇన్ని గింజలు అడకపో "

' ఏరిన పరిగ పది శేర్లన్నా అవుతాయి. ఏరుకొమ్మని వుంచి పొమ్మంటదేమిటి? ' అనుకుంటూ బిత్తరపోయి నిల్చుంది. నోటిలో తడి ఆరిపోయింది. కళ్ళం చేయడానికి తొందర తొందరగా మొదలను లేపడం వల్ల పనలన్నీ పడిపోయినయి.

"లేకపోతే రెండు మల్లల్ల గంత పరిగా పట్టుకపోయి ఆ మెదలల్లా కలుపు" నడుంకు చేతులు ఆనించి శాసించినట్లు అంది.

" ఏరనైతే ఏరిన మీ దయ, ఎక్కడైన ఏరుకున్నోళ్ళకే పరిగ "

"అట్లయితే సగం తీసుకపో, సగం అక్కడ పెట్టు " అంటూ బావి వైపు నడిచింది. చేసేది లేక చంద్రమ్మ చూస్తూ నిలుచుంది. అంతకు ముందున్న సంతోషం ఆవిరైపోయింది. పొద్దుగూకే వేళ, చేసేది లేక మట్టిలో రాలిన వడ్లగింజల మీద చంద్రమ్మ చూపులు ఆగినయి. పొద్దున్నే వచ్చి ఆ లేకినన్నా ఊక్కోవాలి. ఊకేసినంక వాటిని సగం ఇవ్వమంటదో ఏమో! ఏరిన పరిగ తనకు పూర్తిగ దక్కలేదు. ఈ లేకి అయినా దక్కుతదో ! అయినా లేకిని అడుగుతర, అడగరులే అనుకుంటూ ఏరిన పరిగెను మెద పక్కమ్మటే పెట్టి బావివైపు నడిచింది.

పొద్దుపొడిచే వరకు చంద్రమ్మ చాట - పొరకతో పొలం వైపు నడిచింది. అప్పటికే ఇద్దరు ఆడవాళ్ళు నిన్నటి రెండు మళ్ళని పేడతో అలుకుతూ కళ్ళం తయారు చేస్తున్నారు.

మళ్ళలో తాను నిన్న చూసిన వడ్ల గింజలు లేవు. ఆ రాత్రి రెండు మళ్ళను పశువులతో తొక్కించినపుడు మట్టిలో కలిసిపోయినయి. చంద్రమ్మ నిరాశతో నిట్టూరుస్తూ చుట్టు చూస్తు నిల్చుంది. కోసి పేర్చిన మెదల మీద పిట్టలు, కాకులు వాలి గింజలను ఏరుకతింటున్నాయి. కొంగలు మాత్రం వొరాలమీద తిరుగుతూ, తడి వున్న చోట చేరిన తల కప్పలను, చేప పిల్లలను పొడుచుక తింటున్నాయి.

కళ్ళం అలుకుతున్న తోటి స్త్రీలు చంద్రమ్మను రమ్మని సైగ చేయగా తాను నిన్న ఏరిన పరిగతొనల వైపు నడిచింది. చంద్రమ్మ తల నిండా ఆలోచనలే.

ఇగ తనను పనికి ఎవ్వరూ రానివ్వరు ! రేపో మాపో సస్తే పిండాకూడు కోసం కొన్ని బియ్యం కావాలి. పరిగ గింజలనన్నా అట్లనే దా సి వుంచుకోవాలి. ఇగ కన్నుమూసే కాలం దగ్గరకొచ్చింది అనుకుంటూ అతి కష్టంగా అడుగు తీసి అడుగు వేస్తూ నడుస్తూ ఉంది.

ఆమె కదలికలకు కప్ప పిల్లలు, మిడతలు పక్కలకు పరుగెడుతున్నయి. పైన గద్దల గుంపు తిరుగుతూ తిరుగుతూ వుంది.

డిసెంబర్ 1995●